## రేపటి నుంచి రైతులకు అవగాహన సదస్సులు

**మండల వ్యవసాయ అధికారి శ్వేత**

శంషాబాద్ రూరల్, మే 3 : మండలంలోని వివిధ గ్రామాల రైతులకు వానకాలంలో సాగు చేసే పంటలపై ఈ నెల 5 నుంచి ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి శ్వేత శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండలంలోని వివిధ గ్రామాలలోని రైతులకు వ్యవసాయ, అనుబంధ పంటలసాగుపై వివిధ అంశాలపై వ్యవసాయశాఖ, జయశంకర్ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో నిర్వహించే అవగాహన కార్యక్రమాలకు ఆయా గ్రామాల రైతులు పాల్గొని వారు సాగు చేస్తున్న పంటలపై మరింత అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ నెల 5న కొత్వాల్‌గూడ,6న హమిదుల్లానగర్,12న పోశెట్టిగూడ,13న కవేలిగూడ,19న నర్కూడ,20న రషీద్‌గూడ,26న రామంజాపూర్,27న చిన్నగోల్కొండ,జూన్3న సంఘీగూడ,4న కాచారం, 9న రాయన్నగూడ,10న శంకరాపూర్ గ్రామాలలో అవగాహన కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

## సినీ నటుడు విజయ్ దేవరకొండ క్షమాపణ చెప్పాలి

హిమాయత్ నగర్,మే 3: గిరిజనులను కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేసిన సినీనటుడు విజయ్ దేవరకొండ తక్షణమే క్షమాపణ చెప్పాలని నవోదయపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు శివ శంకర్ పటేల్, రాష్ట్ర కార్యదర్శి గుగులోతు శంకర్ డిమాండ్ చేశారు. శనివారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. నటుడు సూర్య నటించిన రెట్రో సినిమా ఆడియో విడుదల కార్యక్రమానికి విజయ్ దేవరకొండ హాజరై గిరిజనులు 500 ఏండ్ల క్రితం కామన్ సెన్స్ లేకుండా దాడి చేసుకున్నారని చేసిన వ్యాఖ్యలను తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. అతడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

## స్నేహిత వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ

ఎర్రగడ్డ, మే 3: ఎర్రగడ్డ డివిజన్ కు చెందిన స్నేహిత వాకర్స్ క్లబ్, కల్యాణ్ నగర్ వెంచర్-3 వాకర్స్ క్లబ్ సంయుక్తంగా కలిసి శనివారం మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో వెయ్యికి పైగా మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశామన్నారు. నేడు(ఆదివారం) కాలనీ పార్క్ సమీపంలో వివేకానంద విగ్రహం వద్ద మజ్జిగ పంపిణీ చేస్తామని నిర్వాహకులు విజయలక్ష్మి పేర్కొన్నారు.

# మారిన ఠాణాల హద్దులు

**తగ్గిన ఫిలింనగర్, జూబ్లీహిల్స్ పీఎస్‌ల పరిధి**

బంజారాహిల్స్/వెంగళరావునగర్,మే 3: ఫిర్యాదు దారులకు మెరుగైన సేవలు అందించడంతో పాటు కేసుల పరిష్కారంలో పోలీసులపై ఒత్తిడి తగ్గించాలనే లక్ష్యంతో రెండేళ్ల క్రితం హైదరాబాద్ నగరంలో కొత్త పోలీస్‌స్టేషన్లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. వెస్ట్‌జోన్ పరిధిలోని జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, పంజాగుట్ట పోలీస్‌స్టేషన్లలోని కొన్ని ప్రాంతాలను కలుపుతూ ఫిలింనగర్, మధురానగర్, బోరబండ పోలీస్టేషన్లను ఏర్పాటు చేశారు. ఆయా ప్రాంతాల్లోని జన సంఖ్యతో పాటు అసెంబ్లీ నియోజకవర్గాల ప్రాతిపదికన కొత్త పీఎస్‌లను ఏర్పాటు చేశారు. కాగా ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోకి వచ్చే కొన్ని ప్రాంతాలతో పాటు మరికొన్ని ప్రాంతాలు కలిసి కొత్తగా టోలీచౌకి పేరుతో పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేస్తూ రెండు రోజుల క్రితం జీవో విడుదలైంది. దీంతో ప్రస్తుతం ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్‌లో ఉన్న సుమారు 40శాతం ప్రాంతాలు కొత్తగా ఏర్పాటైన టోలీచౌకితో పాటు గోల్కొండ పీఎస్‌లోకి కలిపేశారు. దీంతో పాటు జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొన్ని ప్రాంతాలను మధురానగర్ పీఎస్‌లోకి కలిపారు. దీంతో ప్రజల్లో గందరగోళం నెలకొంది. సరిహద్దుల విషయంలో స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని, బస్తీలు, కాలనీల్లో సమావేశాలు ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

- ఫిలింనగర్ పీఎస్ పరిధిలో ఉన్న మణికొండ రోడ్డుకు కుడివైపున ఉన్న కొన్ని కాలనీలను టోలీచౌకిలోకి, మరికొన్ని ప్రాంతాలను ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్‌లోకి కలపడంతో గందరగోళం నెలకొంది. ఈ మొత్తం ప్రాంతాన్ని ఫిలింనగర్‌లోనే ఉంచితే సరిహద్దు సమస్యలు ఉండవని స్థానికులు అంటున్నారు.



ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్..

- మరోవైపు జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ 86నుంచి హకీంపేట రోడ్డును టోలీచౌకిలోకి కలపడంతో సమస్యలు పెరగనున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫిలింనగర్, జూబ్లీహిల్స్ పీఎస్‌ల నుంచి తొలగించిన ప్రాంతాలు ఇలా ఉన్నాయి.

### ఫిలింనగర్ పీఎస్ నుంచి తొలగించిన ప్రాంతాలు

సమతాకాలనీ, ఎస్‌ఏ కాలనీ, గోల్డెన్ శాండ్ కాలనీ, విరాట్ నగర్, సూర్యనగర్ కాలనీ, ఆదిత్యనగర్ కాలనీ, అడమ్స్ కాలనీ, అజీజ్‌బాగ్ కాలనీ, అరవింద్‌నగర్ కాలనీ, జానకీ నగర్ కాలనీ,ఖాజా గుల్షన్ కాలనీ, మినీ జానకీ నగర్, డీలక్స్ కాలనీ, బృందావన్ కాలనీ, సబ్జా కాలనీ, హకీంషా కాలనీ, హకీంపేట్ కుంట, రోడ్డు నంబర్ 86నుంచి హకీంపేట కుంట ప్రాంతాలను కొత్తగా ఏర్పాటు చేసిన టోలీచౌకి పీఎస్‌లో చేర్చారు.

- సత్యకాలనీ, హరిజన్ బస్తీ, ఫ్రెండ్స్ కాలనీ, గుల్షన్ కాలనీ, డైమండ్ హిల్స్ కాలనీ, లక్ష్మీనగర్ కాలనీ, దత్తాత్రేయ నగర్ కాలనీ, ఐకమత్య కాలనీ, వినాయక్‌నగర్, శివాజీనగర్, జైహింద్‌నగర్, వినోబానగర్ ఫేజ్-1, సీతానగర్, తేజాకాలనీ, బంజారీ దర్వాజా, టీఎస్ మైనార్టీ హాస్టల్ ప్రాంతాలను ఫిలింనగర్ పీఎస్‌నుంచి తొలగించి గోల్కొండ పీఎస్‌లో చేర్చారు.

### జూబ్లీహిల్స్ పీఎస్‌నుంచి మధురానగర్ పీఎస్‌కు

యూసుఫ్‌గూడ బస్తీ, ఎల్ఎన్‌నగర్ నగర్, నవోదయ కాలనీ, శాలివాహననగర్, గ్రీన్‌బావార్చి, ప్రగతి నగర్, మారుతీనగర్, శ్రీ కృష్ణదేవరాయనగర్, సవేరా ఫంక్షన్ హాల్, మహమూద్ ఫంక్షన్ హాల్, కృష్ణానగర్ ఏ బ్లాక్, ఎస్‌బీహెచ్ కాలనీ తదితర ప్రాంతాలను జూబ్లీహిల్స్ పీఎస్ నుంచి మధురానగర్ పీఎస్‌కు మార్చారు.







## కుటుంబ సభ్యులకు ఎల్వోసీ అందజేత


బాధిత కుటుంబ సభ్యులకు ఎల్వోసీ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ తదితరులు

శంషాబాద్ రూరల్, మే 3 : బాధిత కుటుంబ సభ్యులకు ఎల్వోసీ పత్రాలను రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ శనివారం తన నివాసంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శంషాబాద్ మండలంలోని నర్కూడ గ్రామానికి చెందిన పద్మకు అనారోగ్యానికి గురికావడంతో కుటుంబ సభ్యులు నగరంలోని పంజాగుట్ట నిమ్స్ దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స చేయడం కోసం రూ. 2.50 లక్షలు అవసరం కావడంతో స్థానిక నాయకుల సహకారంతో తన దృష్టికి తీసుకొచ్చారు. దీంతో స్పందించి తాను రూ. 2.50లక్షల ఎల్వోసీ పత్రాలు అంద జేసి నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమం లో పార్టీ నాయకులు శంషాబాద్ మాజీ సర్పం చ్ గణేష్‌గుప్త, చంద్రారెడ్డి, నీరటి రాజుముదిరాజ్, చందన్‌వెల్లి శ్రీనివాస్,నీరటిశేఖర్, గుండాల విశ్వనాథం, పర్వతం ప్రభు, నర్సింహ, మల్లేష్ పాల్గొన్నారు.

## వీధి వ్యాపారంపై అవగాహన

మణికొండ, మే 3: వీధి వ్యాపారులు తమ హక్కులను తెలుసుకోవాల్సిన అవసరం ఉందని మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ అన్నారు. శనివారం మణికొండలోని వీధి వ్యాపారులతో బీఆర్ఎస్ నాయకులు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వీధి వ్యాపారుల చట్టం గురించి పూర్తి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కుంభగళ్ల ధనరాజ్, గుట్టమీది నరేందర్, సంఘం శ్రీకాంత్, యాలాల కిరణ్, జైరామ్, భానుచందర్, సుమనళిని, బెన్నీ, షేక్ ఆరిఫ్, చెరుకూరి బాలాజీ, ఎస్.రేఖ, అశ్వక్ ఆలీ, ఆరిఫ్‌మహ్మద్, ప్రవీణ్ తదితరులున్నారు.


మణికొండలో వీధి వ్యాపారుల సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ, చిత్రంలో పార్టీ నాయకులు



## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**చదువుకున్న పాఠశాలలో సీసీ కెమెరాల ఏర్పాటుకు రూ.1,25,000 అందజేత**

*యూసుఫ్‌గూడలోని ప్రభుత్వ పాఠశాలలో 2006-07 బ్యాచ్ పూర్వ విద్యార్థులంతా పద్దెనిమిదేళ్ల తర్వాత కలుసుకున్నారు. వారికి విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. నాటి తీపి గుర్తులను మిత్రులంతా కలిసి మరోసారి నెమరువేసుకున్నారు. ఈ సందర్భంగా తాము చదువుకున్న పాఠశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు రూ.1,25000 అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వవిద్యార్థులతో పాటు గురువులు నరసింహ, ప్రభాకర్, పరమేశ్వరమ్మ పాల్గొన్నారు.*
*- సిటీబ్యూరో, మే 3,(నమస్తే తెలంగాణ):*

## సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

బండ్లగూడ, మే 3: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ పేర్కొన్నారు. శనివారం ఆయన స్థానిక కార్పొరేటర్ అర్చన జయప్రకాష్‌తో కలిసి రాజేంద్రనగర్ డివిజన్ పరిధిలోని శివరాంపల్లి ఉప్పరపల్లి తదితర ప్రాంతాల్లో సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజల సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు శ్రీధర్ రెడ్డి, శంకర్, ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.


ఉప్పరపల్లిలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

**కోటి 30 లక్షలు మంజూరు**

ప్రజల సహకారంతో అభివృద్ధి పనులలో దూసుకుపోతున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శివ సాయి నగర్, తిరుమల హిల్స్ కాలనీవాసులు ఎమ్మెల్యేను కలిసి సమస్యలను వివరించారు. ఈ మేరకు ఆయన మున్సిపల్ కార్పొరేషన్ నుంచి ఆయా కాలనీల అభివృద్ధికి కోటి 30 లక్షల పనులను మంజూరు చేస్తూ ఆ కాపీని కాలనీవాసులకు అందజేశారు. కార్యక్రమంలో పూలపల్లి కృష్ణారెడ్డి, భోగాల శ్రీనివాస్, ప్రేమ్ కుమార్, సురేష్ గౌడ్, రాంప్రసాద్, హరీశ్ గౌడ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

## టీజీఎస్‌ఆర్టీసీ లాజిస్టిక్ సేవలు ప్రారంభం

మణికొండ, మే 3: మణికొండ మర్రిచెట్టు బస్‌స్టాప్ వద్ద టీజీఎస్‌ఆర్‌టీసీ లాజిస్టిక్ సేవలు ప్రారంభించింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ మాజీ చైర్మన్ నరేందర్, వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డిలు పాల్గొన్నారు. మణికొండ పరిసర ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మీ పార్సిళ్లను తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఇతర రాష్ట్రాలకు బుకింగ్ చేసుకొని పంపించుకోవాలన్నారు. ప్రజల సౌకర్యం కోసం ఆర్టీసీ ఈ సేవలను ప్రారంభించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు ఏటీ ఎం పాల్, డీఎంఈ రమేష్, ఏజెంట్ రమేష్‌గౌడ్, నరేందర్‌రెడ్డి, రవికాంత్‌రెడ్డి, రాఘవరెడ్డి, ఆనంద్ రావు, రాజేష్, ముత్యాలు, శ్రీనివాస్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, రాములు పాల్గొన్నారు.



మర్రిచెట్టు బస్‌స్టాప్ వద్ద లాజిస్టిక్ సేవలను ప్రారంభిస్తున్న మున్సిపల్ మాజీ చైర్మన్ నరేందర్ తదితరులు

## ఓం నగర్‌లో తాగుటి పైప్‌లైన్ ఏర్పాటు చేయండి

బండ్లగూడ, మే 3: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఓం నగర్ కాలనీలో పోచమ్మ దేవాలయం నుంచి మెయిన్ రోడ్ వరకు మంచినీటి పైపులైన్ ఏర్పాటు చేయాలని మాజీ ఎంపీటీసీ సురేష్ గౌడ్ జలమండలి మేనేజర్ శ్రీనివాస్ కు విజ్ఞప్తి చేశారు. శనివారం ఆయన జలమండలి మేనేజర్ శ్రీనివాస్ తో కలిసి ఓం నగర్ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా సురేష్ గౌడ్ మాట్లాడుతూ పోచమ్మ దేవాలయం నుండి మెయిన్ రోడ్ వరకు రోడ్డు వేసేందుకు ప్రణాళికలు పూర్తయ్యాయని వివరించారు. రోడ్డు వేసే కంటే ముందే పైప్ లైన్ వేసి రోడ్డు వేస్తే మరల రోడ్డు తవ్వకుండా ఉంటారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రవీణ్ గౌడ్, చంద్ర ప్రకాష్, శ్రీనాథ్ తదితరులు ఉన్నారు.

## ఇంటర్ విద్యార్థినికి ఊపిరి పోసిన నిమ్స్ వైద్యులు

ఖైరతాబాద్, మే 3 : ఇంటర్ పరీక్షల్లో ఫెయిలు కావడంతో రసాయన పదార్థం సేవించి అస్వస్థతకు గురైన ఓ విద్యార్థినికి నిమ్స్ వైద్యులు ప్రాణం పోశారు. కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణానికి చెందిన పల్లా శృతి గత నెల 23న ఇంటర్మీడియేట్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించకపోవడంతో మనస్థాపానికి గురై ఇంట్లో ఉన్న ఓ రసాయన పదార్థాన్ని సేవించింది. ఆమెకు కుటుంబ సభ్యులు స్థానిక ప్రైవేట్ దవాఖానలో చేర్పించినా ఎలాంటి ఫలితం లేకపోవడంతో నిమ్స్ దవాఖానకు తరలించారు. సుమారు ఏడు రోజుల పాటు మెరుగైన చికిత్స అందించడంతో ఆమె కోలుకుంది. దీం తో వైద్యులు ఆమెను డిశ్చార్జి చేశారు.

## మానసిక ఆరోగ్య సాధన, కృత్రిమ మేధస్సుపై అవగాహన

హిమాయత్‌నగర్, మే 3: నిత్యం సమాజ శ్రేయస్సు కోసం పాటు పడుతున్న తెలంగాణ సైకాలజిస్ట్ అసోసియేషన్ 9వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఈ నెల 5నుంచి నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మోతుకూరి రాంచందర్ తెలిపారు. శనివారం హిమాయత్‌నగర్‌లో అసోసియేషన్ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాంచందర్ మాట్లాడుతూ మానసిక ఆరోగ్య సాధన, కృత్రిమ మేధస్సు అనే అంశంపై సదస్సులు, ఆధునిక యుగంలో పిల్లల పెంపకం సవాళ్లపై వ్యాసరచన పోటీలతో పాటు వివిధ అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో సైకాలజిస్టులు అధిక సంఖ్యల్లో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో అసోసియేషన్ నేతలు సుధాకర్, రాజు, ఆచార్య, నారాయణ రావు, శశికిరణ్ పాల్గొన్నారు.

## ప్రజలకోసం ప్రభుత్వ స్థలం వినియోగిస్తాం

**మంత్రి పొన్నం ప్రభాకర్**

బంజారాహిల్స్.మే 3: బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 12లోని ఎమ్మెల్యే కాలనీని ఆనుకుని ఉన్న 12 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని ప్రజలకు ఉపయోగపడే పనుల కోసం వినియోగిస్తామని హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. షేక్‌పేట మండల పరిధిలోని బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 12లో కబ్జాదారులనుంచి కాపాడిన 12 ఎకరాల స్థలాన్ని శనివారం మంత్రి పొన్నం ప్రభాకర్, జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తదితరులు పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ..ప్రభుత్వ స్థలాలను ఆక్రమించే వారిపై కఠినంగా వ్యవహరించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. ఎన్నో ఏళ్లుగా అనేక రకాలైన వివాదాలు సృష్టించి ఎమ్మెల్యే కాలనీ పక్కనున్న ప్రభుత్వ స్థలాలను ఆక్రమించేందుకు ప్రయత్నాలు జరిగాయని, స్థానిక తహసీల్దార్ అనితారెడ్డితో పాటు జిల్లా యంత్రాంగం సమన్వయంతో స్థలాన్ని కాపాడడంతో పాటు ఫెన్సింగ్ వేయించడం అభినందనీయమన్నారు. ఈ స్థలాన్ని ప్రజలకు ఉపయోగపడేలా వినియోగిస్తామన్నారు.


బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 12లోని ఎమ్మెల్యే కాలనీ పక్కన ప్రభుత్వ స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

## రైతులకు అండగా ఉంటాం

వ్యవసాయ యూనివర్సిటీ మే 3: ఈనెల 5 నుంచి రైతు ముంగిట్లో శాస్త్రవేతలు పీజేటీఏయూ ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య అన్నారు.ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య కమ్యూనిటీ సైన్స్ కళాశాలలో మీడియా సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ విద్యా ప్రవేశాల్లో రైతు బిడ్డలకు 40 శాతం ప్రత్యేక కోటా ఉందని, ఈ కోటా నుంచి ఈ ఏడాది నుంచి రైతు కూలీల పిల్లలకు 15 శాతం కోటా సీట్లు ఇస్తామని జానయ్య వివరించారు. భవిష్యత్ తరాలకు ఉద్దేశించిన ఉపాధ్యాయులు తమ ప్రాంతాల్లో పాల్గొనాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ శ్రీ పాల్ రెడ్డి కోరారు. వ్యవసాయ శాఖ ఈ కార్యక్రమంలో పూర్తిస్థాయిలో భాగస్వామ్యం అవుతుందని వ్యవసాయ శాఖ అడిషనల్ డైరెక్టర్ విజయ్ కుమార్ , డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్,నోడల్ అధికారి డాక్టర్ చల్లా వేణుగోపాల్ రెడ్డి వివరించారు.

- జూన్ 13వరకు రాష్ట్రంలోని దాదాపు 1200 రెవిన్యూ గ్రామాల్లో 200 శాస్త్రవేత్తల బృందాలు పర్యటించనున్నారన్నారు.దక్షిణ వ్యవసాయ మండలంలో 100 శాస్త్రవేత్తల బృందాలు, ఉత్తర, మధ్య తెలంగాణ మండలాల్లో 50 చొప్పున శాస్త్రవేత్తల బృందాలు క్షేత్రస్థాయిలో పర్యటించనున్నారన్నారు.
- ప్రతి బృందంలో ఇద్దరు శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు, వ్యవసాయ విద్యార్థులు, ఇతర స్థానిక ప్రభుత్వ శాఖల సిబ్బంది, అభ్యుదయ రైతులు పాల్గొంటారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్లు

**రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు**

రాష్ట్రంలో ధాన్యం వివిధ పంటలు అధిక దిగుబడులు సాధించాలంటే ,రైతులకు శాస్త్రవేతలు అండగా నిలవాలని ,భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి అటారి జోన్ డైరెక్టర్ షేక్ మీరా అన్నారు. శనివారం వ్యవసాయ శాస్త్రవుతలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు అనంతరం ఆయన మాట్లాడారు.



## అలరించిన కర్ణాటక సంగీత కచేరి

*సంగీతంతో మానసిక ప్రశాంతత లభిస్తుందని పాట్నా హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఎల్. నరసింహారెడ్డి, కేశవ్ విద్యాసంస్థల సొసైటీ వైస్ చైర్మన్ జె. నరసింహారావు అన్నారు. వాగ్గేయకారుడు త్యాగరాజ స్వామి 258 జయంతి ఉత్స వాల సందర్భంగా శనివారం రాత్రి నారాయణ గూడలోని కేశవ్ మెమోరియల్ ఆవరణలో డాక్టర్ స్వర్ణ మంగళపల్లి చంద్రశేఖరన్ బృందంచే కర్ణాటక సంగీత కచేరి, పంచరత్న కృతుల ఆరాధన కార్యక్రమం వీనుల విందుగా జరిగింది. జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను వారు ప్రారంభించగా యువ కళాకారులు మహాగణపతి కీర్తనతో స్వాగత నృత్యం చేశారు. ఈ కార్య క్రమంలో సొసైటీ కార్యదర్శి అన్నదానం సుబ్రహ్మణ్యం, డైరెక్టర్ డాక్టర్ నాగేశ్వర రావు, డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ వేదులశాంతి, కోశాధికారి ప్రభాకర్‌రెడ్డిపాల్గొన్నారు.- హిమాయత్ నగర్, మే3*

## మహిళల ఆర్థిక అభ్యున్నతికి కృషి

జూబ్లీహిల్స్,మే 3: పేద మహిళల ఆర్థిక అభ్యున్నతికి కృషి చేయాలని జీహెచ్ఎంసీ 19వ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జాకియా సుల్తానా సూచించారు. శనివారం యూసుఫ్‌గూడలోని జీహెచ్ఎంసీ కార్యాలయంలో వివిధ విభాగాల అధికారులతో సమావేశం నిర్వహించారు. మహిళలకు కుటుంబ నిర్వహణలో పొదుపు ఆవశ్యకతను వివరించి ప్రతి పేద మహిళ ఎస్‌హెచ్‌జీ సభ్యులుగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో యూసీడీపీఓ వెంకట కిషన్ రావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## పార్కుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

మైలార్‌దేవ్‌పల్లి, మే 3: పార్కుల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తున్నామని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని సారధియూత్ క్లబ్ జీహెచ్ఎంసీ పార్కు, టీఎన్‌జీవోస్ కాలనీలో పార్కు సుందరీకరణ పనుల్లో భాగంగా హార్టికల్చర్ సిబ్బందితో కలిసి శనివారం ఆయన సందర్శించి పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ఫుట్‌పాత్‌తో కూడిన ఆహ్లాదకరమైన మొక్కలతో ప్రాంగణంలో ఉండే విధంగా నీటి సౌకర్యం, పార్క్ మెయింటెనెన్స్ జతపరుస్తూ పనులు వీలైనంత త్వరగా ప్రారంభించాలన్నారు.

## ఎస్.ఆర్.నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా గంగిరెడ్డి విజయ్ కుమార్



వెంగళరావునగర్, మే 3: ఎస్.ఆర్. నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా గంగిరెడ్డి విజయ్ కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. 2009 బ్యాచ్ కు చెందిన విజయ్ కుమార్ 2011లో బాలానగర్ సబ్ ఇన్‌స్పెక్టర్ గా(లా అండ్ ఆర్డర్) విధుల్లో చేరారు. అనంతరం జేఎన్‌టీయూకు బదిలీ అయ్యారు. ఇక్కడ కొంతకాలం పనిచేసి 2023 లో ఎస్.ఓ.టి ఇన్స్పెక్టర్‌గా తిరిగి బాలానగర్,ఆమనగల్,బేగం బజార్ ఇన్‌స్పెక్ట రోగా పని చేసిన విజయ్ కుమార్ ఎస్. ఆర్.నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా విధుల్లో చేరారు.

**ఎస్.ఆర్.నగర్ డీఐగా శ్రీకాంత్**

ఎస్.ఆర్.నగర్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ గా కె. శ్రీకాంత్ శనివారం బాధ్యతలు స్వీకరించారు.

## విద్యుదాఘాతంతో గొర్రె మృతి

శంషాబాద్ రూరల్, మే 3 : కరెంట్‌షాక్‌తో ఒక గొర్రె మృతి చెందగా, మరో రెండు గొర్లకు గాయాలైన ఘటన శనివారం శంషాబాద్ మండలం మల్కారం గ్రామంలో జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం మల్కారం గ్రామానికి చెందిన కూతురు రాజు రోజు శనివారం గొర్రెలను మేతకు తీసుకెళ్తుండగా గ్రామ సమీపంలోని ఆశజ్యోతి దవాఖాన వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ చుట్టు వైర్లు తేలడంతో అటుగా వచ్చిన గొర్లకు షాక్ తగిలింది. వెంటనే గమనించిన స్థానికులు కర్రల సాయంతో మూడు గొర్లను షాక్ నుంచి తప్పించే ప్రయత్నం చేశారు. ఒక గొర్రె మృతి చెందగా మరో రెండు గొర్లను రక్షించా రు. గాయాలైన గొర్లు 24 గంటలు దా టితే కాని వాటి పరిస్థితి చెప్పలేమని వైద్యులు వివరిస్తున్నట్లు స్థానికులు తెలిపారు.

## యువతకు ఉపాధి కల్పించడంలో విఫలం

హిమాయత్ నగర్,మే3: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో పూర్తిగా విఫలం చెందాయని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ధర్మేంద్ర విమర్శించారు. ఏఐవైఎఫ్ 66వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం హిమాయత్ నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్ వద్ద జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువజనులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఏఐవైఎఫ్ కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నేతలు ఆర్.బాలకృష్ణ, ఎన్.శ్రీకాంత్, శ్రీమాన్, షేక్ మహమూద్, మధు, శివ కుమార్ తదితరులు పాల్గొన్నారు.